# మెచ్చా గెలుపు ఏక పక్షమే





అన్నపురెడ్డిపల్లి: మాట్లాడుతున్న బోయినపల్లి సుధాకర్‌రావు, టేకులపల్లి: ప్రచారం చేస్తున్న సర్పంచ్ రమాదేవి, నాయకులు

అన్నపురెడ్డిపల్లి, అక్టోబర్ 31: త్వరలో జరుగనున్న అసెంబ్లీ ఎన్నికల్లో అశ్వారావుపేట నియోజకవర్గంలో ఎమ్మెల్యే మెచ్చా గెలుపు ఏక పక్షమే అని, మూడోవ సారి సీఎం కేసీఆర్ హ్యాట్రిక్ విజయం సాధించడం ఖాయమని బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు బోయినపల్లి సుధాకర్‌రావు అన్నారు. మంగళవారం అన్నపురెడ్డి పల్లి, వెంకటాపురంలో ప్రచారం నిర్వహించారు. ఈసందర్భంగా సుధాకర్‌రావు మాట్లాడుతూ... సీఎం కేసీఆర్ అమలు చేసిన సంక్షేమ పథకాలే బీఆర్ఎస్ గెలుపు బాటలు వేస్తాయని, బీఆర్ఎస్ తోనే అభివృద్ధి సాధ్యమన్నారు. ఇంటింటికెళ్లి బీఆర్ఎస్ చేపట్టి అమలుచేస్తున్న పథకాలతో, మ్యానిఫెస్టో అంశాలు, రేగా చేసిన అభివృద్ధిని ప్రజలకు వివరిస్తూ ఓట్లు అభ్యర్థించారు. మెచ్చాకు ప్రతి ఒక్కరు మద్దతు తెలిపి భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు జంగాల ఉమ, చల్లా రాంబాబు, పుల్లారావు, వీరభద్రం, శివ, బాలకృష్ణ, నాగేంద్ర, వెంకటేశ్వర్లు, సత్యం, రాంబాబు, శ్రీను, బాషా పాల్గొన్నారు.

### హరిప్రియ గెలుపు కోసం ఇంటింటి ప్రచారం

టేకులపల్లి, అక్టోబర్ 31: ఇల్లెందు బీఆర్ఎస్ అభ్యర్థి బానోత్ హరిప్రియానాయక్ గెలుపు కోసం సర్పంచ్ కల్తీ రమాదేవి ఆధ్వర్యంలో మంగళవారం ఇంటింటి ప్రచారం చేపట్టారు. మండలంలోని ప్రేగళ్లపాడు పంచాయతీ పరిధి తూర్పుగూడెంతండాలో బీఆర్ఎస్ మండల ప్రచార కార్యదర్శి జాటోత్ నరేశ్ ఆధ్వర్యంలో బుడియాబాపు వెంకటేశ్వరస్వామి ఆలయంలో హరిప్రియ గెలుపు కోసం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా సర్పంచ్ రమాదేవి మాట్లాడుతూ ఇల్లెందు నియోజకవర్గం అభివృద్ధి చెందాలంటే కారు గుర్తుకు ఓటు వేసి హరిప్రియను భారీ మెజార్టీతో గెలిపించాలని ఓటర్లను కోరారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ గ్రామ శాఖ అధ్యక్షుడు కొండబత్తుల శ్యామ్, నాయకులు జార మల్లేశ్, అంగోత్ లచ్చానాయక్, బిక్కులాల్, చిట్టీరాజు, మాలోత్ లింగా, బోడా రమేశ్, దాసరి లింగమల్లు, కోరం శ్రీకాంత్, బానోత్ రవి పాల్గొన్నారు.

## నర్సరీల నిర్వహణలో ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలి



నర్సరీని పరిశీలిస్తున్న ఏపీడీ రవి

అశ్వారావుపేట టౌన్, అక్టోబర్ 31: గ్రామ పంచాయతీల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న హరిత నర్సరీల నిర్వహణలో ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని అప్పుడే ముందస్తు లక్ష్యాన్ని చేరుకుంటామని అడిషనల్ ప్రాజెక్టు డైరెక్టర్ డీఆర్‌డీఏ నల్ల భోతుల రవి సూచించారు. మంగళవారం మండలంలోని నర్సరీలను ఆయన సందర్శించారు. మేజర్ పంచాయతీ నర్సరీ నిర్వహణ బాగుందని ఈవో గజవెల్లి హరికృష్ణను ప్రశంసించారు. అనంతరం ఉపాధి హామీ పనుల నిర్వహణలో భాగంగా రిజిస్టర్‌లను తనిఖీ చేసి సిబ్బందికి సూచనలు చేశారు. ఎవెన్యూ ప్లాంటేషన్‌లకు పంచాయతీ ట్యాంకర్‌ల ద్వారా నీటిని అందించాలని ఎండలు ఎక్కువగా ఉన్నందున మొక్కల రక్షణకు చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఆయన వెంట ఈవో గజవెల్లి హరికృష్ణ, ఈజీఎస్ ఏపీవో నరేశ్, సిబ్బంది ఉన్నారు.

## ఏఐటీయూసీ ఆవిర్భావ వేడుకలు

టేకులపల్లి, అక్టోబర్ 31: టేకులపల్లిలో ఏఐటీయూసీ 104వ ఆవిర్భావ వేడుకలు సీపీఐ జిల్లా కౌన్సిల్ సభ్యుడు గుగులోత్ రాంచందర్ ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించారు. తొలుత కేక్ కట్ చేశారు. ఆయన మాట్లాడుతూ కార్మిక వర్గ పోరాటమే ఏఐటీయూసీ అని, సంఘటిత, అసంఘటిత రంగం ఉద్యోగులకు ఆవిర్భావ దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు గుగులోత్ శ్రీను, ఐత శ్రీరాములు, వాసం భద్రయ్య, బానోత్ వీరన్న, తేజావత్ మధు, ఇస్లావత్ రవీందర్, తేజావత్ లక్ష్మణ్, గుగులోతు సోనీ పాల్గొన్నారు.

# రిటర్నింగ్ అధికారి కార్యాలయం ముస్తాబు



ఎన్నికల రిటర్నింగ్ అధికారి కార్యాలయం

అశ్వారావుపేట, అక్టోబర్ 31: త్వరలో జరుగనున్న సాధారణ ఎన్నికలకు రెవెన్యూ కార్యాలయం ముస్తాబైంది. ఎన్నికల రిటర్నింగ్ ఆఫీసర్ చాంబర్‌ను ప్రత్యేకంగా ఏర్పాటు చేశారు. 2009లో నియోజకవర్గాల పునర్విభజనలో అశ్వారావుపేట నియోజకవర్గంగా ఏర్పాటైంది. ఇప్పటి వరకు 2009, 2014, 2018 ఎన్నికలు జరిగాయి. నాల్గోవ సారి అసెంబ్లీ ఎన్నికల నిర్వహణకు అధికారులు సన్నద్ధమయ్యారు. ఈ నెల 3వ తేదీన ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు రిటర్నింగ్ ఆఫీసర్ అభ్యర్థుల నుంచి నామినేషన్లు స్వీకరించనున్నారు. ఈ నెల 30 తేదీన జరుగనున్న పోలింగ్‌కు అధికారులు పోలింగ్ కేంద్రాలను సిద్ధం చేస్తున్నారు. నియోజకవర్గ వ్యాప్తంగా ఐదు మండలాల్లోని 124 ప్రాంతాల్లో 184 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. మొత్తం 1,53,757 మంది ఓటర్లు ఉన్నారు. వీరిలో మహిళలు 78,671 మంది, పురుషులు 75,080మంది, ఇతరులు ఆరుగురు ఉన్నారు. మావోయిస్ట్ ప్రభావిత జిల్లా కావటంతో ఎన్నికల సంఘం పోలింగ్ ఉదయం 7 నుంచి సాయంత్రం 4 గంటలకు కుదించింది. ఎన్నికల నిర్వాహణపై రిటర్నింగ్ ఆఫీసర్ పి రాంబాబు పర్యవేక్షణలో అధికారులకు రెండు రోజుల పాటు శిక్షణ ఇచ్చారు.

## దర్గాలో ప్రార్థనలు చేసిన మంత్రి సత్యవతి



ప్రార్థనలు చేస్తున్న మంత్రి సత్యవతి, ఎంపీ కవిత

ఇల్లెందు రూరల్, అక్టోబర్ 31: మండలంలోని సత్యనారాయణపురంలోని నాగుల్ మీరా మౌలా చాన్ దర్గా షరీఫ్‌లో రాష్ట్ర స్త్రీ శిశు గిరిజన సంక్షేమ శాఖ మంత్రి సత్యవతి రాథోడ్ మంగళవారం ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ తన జన్మదినాన్ని దర్గాలో అందరి మధ్య ప్రార్థనలు , పూజలు జరుపుకోవడం ఆనందంగా ఉందన్నారు. ఈ దర్గాకు ప్రత్యేకత ఉందన్నారు. కులమతాలకు అతీతంగా మతసామరస్యాన్ని నాగుల్‌మీరా దర్గా చాటుతుందన్నారు. కార్యక్రమంలో మహబూబాబాద్ ఎంపీ మాలోత్ కవిత, ఎమ్మెల్యే హరిప్రియానాయక్, మహబూబాబాద్ జడ్పీ చైర్మన్ ఆంగోత్ బిందు, మున్సిపల్ చైర్మన్ దమ్మాలపాటి వెంకటేశ్వరరావు, వైస్ చైర్మన్ జానీపాషా, పీఏసీఎస్ చైర్మన్ మూల మధుకర్‌రెడ్డి పాల్గొన్నారు.

## ఎన్నికల నిర్వహణలో నిబంధనలు పాటించాలి



మాట్లాడుతున్న జిల్లా అదనపు కలెక్టర్ రాంబాబు

అశ్వారావుపేట, అక్టోబర్ 31: త్వరలో జరుగనున్న అసెంబ్లీ ఎన్నికల నిర్వహణలో అధికారులు ఎన్నికల సంఘం నిబంధనలను పాటించాలని అశ్వారావుపేట రిటర్నింగ్ అధికారి, జిల్లా అదనపు ఆఫీసర్ పీ రాంబాబు సూచించారు. స్థానిక వ్యవసాయ కళాశాలలో జరుగుతున్న ఎన్నికల శిక్షణా తరగతులు మంగళవారం ముగిశాయి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికలు పూర్త య్యే వరకు అధికారులు అందుబాటులో ఉండాలన్నారు. పోలింగ్ కేంద్రాల్లో ఏర్పాటు చేయనున్న మౌలిక సదుపాయాలు, ప్రజలు ఓటును ఏ విధంగా వినియోగించుకోవాలని వివరించారు. ఎన్నికల అధికారులు ఓటర్లకు పూర్తిగా సహకరించి నూరు శాతం పోలింగ్ కోసం దృష్టి సారించాలని చెప్పారు. విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే శాఖాపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో పీవోలు, ఏపీవోలు పాల్గొన్నారు.

## పీవో, ఏపీవోలకు ఎన్నికల శిక్షణ

ఇల్లెందు రూరల్, అక్టోంబర్ 31: ఇల్లెందు అసెంబ్లీ నియోజకవర్గ ఎన్నికల శిక్షణ కార్యక్రమాన్ని రిటర్నింగ్ అధికారి, డిప్యూటీ కలెక్టర్ జే కాశయ్య మంగళవారం పరిశీలించారు. మండలంలోని కరెంట్ ఆఫీస్ ఏరియాలోని ట్రైబల్ వెల్ఫేర్ జూనియర్ కళాశాలలో రెండు రోజుల పాటు జరిగే శిక్షణకు 379 మంది పీవో, ఏపీవోలు హాజరయ్యారు. ఆయన మాట్లాడుతూ ఓటు సద్వినియోగం చేసుకునేందుకు వచ్చే ఓటర్లకు ఇబ్బందులు కలుగకుండా సహాయపడటం, వీవీప్యాట్ పనితీరు, ఓటు వేసే విధానం, నమోదు అయ్యే విధానం, ప్రజలకు అసౌకర్యం కలుగకుండా తీసుకునే ఏర్పాట్లు, తాగునీటి సౌకర్యం తదితర విషయాలపై చర్చించామన్నారు. కార్యక్రమంలో నోడల్ అధికారి టీవీఆర్‌ఎన్ స్వామి, ఇల్లెందు, టేకులపల్లి, బయ్యారం, కామేపల్లి తహసీల్దార్లు, పీవో, ఏపీవోలు, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## రోడ్డు ప్రమాదంలో వివాహిత మృతి

దమ్మపేట, అక్టోబర్ 31: రోడ్డు ప్రమాదంలో వివాహిత మృతిచెందిన ఘటన మండలంలోని ముష్టిబండ శివారులో మంగళవారం చోటుచేసుకున్నది. కుటుంబసభ్యులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... దమ్మపేటకు చెందిన సామిరెడ్డి నాగకిరణ్‌రెడ్డి తన భార్య ప్రత్యూష, కుమార్తె రుత్వికలతో కలిసి ద్విచక్రవాహనంపై సత్తుపల్లి ఆస్పత్రికి వెళ్తుండగా ముష్టిబండ శివారుకు వెళ్లగానే వెనుకనుంచి అశ్వారావుపేట నుంచి సత్తుపల్లి వైపు వెళ్తున్న లారీ ఢీకొట్టింది. దీంతో ప్రత్యూషతో పాటు నాగకిరణ్‌రెడ్డి, రుత్వికలకు గాయాలయ్యాయి. ప్రత్యూష ను దమ్మపేట ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకువచ్చేసరికి అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు చెప్పారు. మృతురాలికి భర్త, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. భర్త నాగకిరణ్‌రెడ్డి ఫిర్యాదు మేరకు ఎస్సై రవికుమార్ కేసునమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

## యువకుడి మృతి...

చంద్రుగొండ, అక్టోబర్ 31: రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి చెందిన ఘటన మంగళవారం మండలంలో చోటు చేసుకున్నది. పోలీసులు, మృతుడి కుటుంబ సభ్యుల తెలిపిన వివరాల ప్రకారం.. బాలికుంట గ్రామానికి చెందిన బోదా నందకుమార్ (18) కూలీ పనులకు వెళ్లి మధ్యాహ్నం ద్విచక్రవాహనంపై ఇంటికి వస్తుండగా ప్రమాదవశాత్తు జారి పడ్డాడు. గమనించిన గ్రామస్తులు కొత్తగూడెం ఏరియా ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గ మధ్యంలో మృతి చెందాడు. మృతుడి తండ్రి బోడా భద్రు అనారోగ్యంతో ఆరేళ్ల క్రితం, తల్లి లక్ష్మి మూడేళ్ల క్రితం రోడ్డు ప్రమాదంలో చనిపోయారు. తన చెల్లి లావణ్యతో కలిసి నందకుమార్ నానమ్మ ఝూంకీ దగ్గర ఉంటున్నాడు. నందకుమార్ మృతి చెందటంతో గ్రామంలో విషాదఛాయలు అలముకున్నాయి. మృతుడి బంధువుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తును చేపట్టారు.

# ఎమ్మెల్యే హరిప్రియ గెలుపు కోసం పూజలు

టేకులపల్లి, అక్టోబర్ 31: ఇల్లెందు ఎమ్మెల్యే, బీఆర్ఎస్ అభ్యర్థి బానోత్ హరిప్రియానాయక్ విజయం సాధించాలని స్థానిక కోందడ రామాలయంలో ప్రచార రథాలకు బీఆర్ఎస్ నాయకులు మంగళవారం ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో మండల ప్రధాన కార్యదర్శి బోడ బాలు నాయక్, నాయకులు కంభంపాటి చంద్రశేఖర్ రావు, బానోత్ రామానాయక్, కంభంపాటి శ్రీనివాసచౌదరి, భూక్యా పాపానాయక్, భూక్యా తావుర్యానాయక్, ఇస్లావత్ బాలునాయక్, ధరావత్ బాలాజీనాయక్, భూక్యా చందర్, భూక్యా కోటేశ్వరరావు, బానోత్ పూల్‌సింగ్‌నాయక్, జాటోత్ నరేశ్, బానోత్ రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

## మాతా-శిశువులపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలి



రికార్డులు పరిశీలిస్తున్న డాక్టర్ చైతన్య

అన్నపురెడ్డిపల్లి, అక్టోబర్ 31: మాత–శిశువులపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని ఎంసీహెచ్ ప్రోగ్రామింగ్ అధికారి డాక్టర్ చైతన్య అన్నారు. మంగళవారం ఎర్రగుంట ప్రభుత్వ ఆస్పత్రిని ఆయన సందర్శించారు. మాత, శిశువులను అందుతున్న సేవలపై రికార్డులను పరిశీలించి, సిబ్బంది నుంచి వివరాలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గర్భిణులు ప్రతి నెలా వైద్య పరీక్షలకు వచ్చేలా చూడాలన్నారు. ప్రభుత్వ ఆసుపత్రిలో ప్రసవాల సంఖ్యను పెంచాలన్నారు. కార్యక్రమంలో మెడికల్ ఆఫీసర్ ప్రియాంక, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## గర్భిణులు, చిన్నారులకు టీకాలు

అశ్వారావుపేట రూరల్, అక్టోబర్ 31: మండలంలోని వినాయకపురం, గుమ్మడవల్లి పీహెచ్‌సీల పరిధిలోని సబ్ సెంటర్లలో టీకాలు కార్యక్రమం నిర్వహించారు. గర్భిణులకు, చిన్నారులకు ప్రత్యేకంగా టీకాలు వేశారు. ప్రభుత్వ వైద్యశాల్లోనే కాన్పులు జరగాలని, కేసీఆర్ కిట్, పరిసరాలు పరిశుభ్రత, సీజనల్ వ్యాధుల గురించి ఏఎన్ఎంలు వివరించారు. కార్యక్రమంలో హెవీ దుర్గ, రాధాబాయి, స్వరూప, శాంతి కుమారి, విజయకుమారి, లక్ష్మి, పద్మ, శ్రీనివాస్, సత్యనారాయణ, వెంకటేశ్వర్లు, భాస్కర్, సత్యనారాయణ పాల్గొన్నారు.

## పనులు సకాలంలో పూర్తి చేయాలి

అశ్వారావుపేట, అక్టోబర్ 31: అడవుల అభివృద్ధి కోసం చేపట్టే పనులను సకాలంలో పూర్తి చేయాలని ఎఫ్‌డీవో దామోదర్‌రెడ్డి సిబ్బందికి సూచించారు. స్థానిక రేంజ్ కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడారు. అటవీ సంరక్షణపై ప్రత్యేక దృష్టి సారించాలని, విధుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరించొద్దని ఆదేశించారు. ఇప్పటి వరకు చేపట్టిన పనులు, ఈ ఏడాది చేపట్టబోయే పనులపై సమీక్షించారు. ఇకపై పోడు లేకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని, పోడు వల్ల కలిగే అనార్థాలపై గిరిజనులకు అవగాహన కల్పించాలన్నారు. అడవుల రక్షణ చర్యలపై నిరంతరం పర్యవేక్షించాలని తెలిపారు. సమావేశంలో ఎఫ్ఆర్‌వో కరునాకర్ చారీ, అశ్వారావుపేట, దమ్మపేట రేంజ్ పరిధిలోని సెక్షన్, బీట్ ఆఫీసర్లు పాల్గొన్నారు.

## సర్దార్ వల్లభాయ్ పటేల్ జయంతి

ఇల్లెందు రూరల్, అక్టోంబర్ 31: స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఎన్ఎస్ఎస్ విభాగంలో ప్రోగ్రాం ఆఫీసర్ విలియం ప్రసాద్ ఆధ్వర్యంలో ప్రిన్సిపాల్ రామలింగేశ్వరరావు మంగళశారం సర్దార్ వల్లభాయ్ పటేల్ జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్వాతంత్ర్యం అనంతరం చెల్లాచెదురైన రాష్ట్రాలన్నింటిని ఒకే దేశంగా తీసుకురావడానికి సర్దార్ వల్లభాయ్ పటేల్ ఎంతో కృషి చేశారన్నారు. పటేల్ జయంతి రోజున ఏక్తాదివస్‌ను జరుపుకుంటామన్నారు. కార్యక్రమంలో అధ్యాపకుడు సోమేశ్వరరావు, ప్రోగ్రాం ఆఫీసర్ తోర్తి జాన్, లైబ్రేరియన్ ఖాసీం, అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది, ఎన్ఎస్ఎస్ వలంటీర్, విద్యార్థులు పాల్గొన్నారు.